నమస్తే తెలంగాణ
# మెదక్
I హైదరాబాద్, గురువారం 7 నవంబర్ 2024 MEDAK



మర్కూక్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

## ధాన్యం సేకరణలో కాంగ్రెస్ సర్కారు విఫలం

మర్కూక్, నవంబర్ 6: ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. బుధవారం మర్కూక్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో గజ్వేల్ నియోజవర్గంలో 111 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరించినట్లు గుర్తుచేశారు. వడ్లు కొన్న 48 గంటల్లో మద్దతుధర చెల్లించామన్నారు. కాంగ్రెస్ పాలనలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ మరిచారని విమర్శించారు. కేసీఆర్ రైతులకు చేయూతనిస్తే, రేవంత్ రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నాడన్నారు. సర్కారు ధాన్యం కొనకపోవడంతో రైతులు వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారని ప్రతాప్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు ఇవ్వడం లేదని, సగం మందికే రుణమాఫీ చేసి రైతులను సర్కారు మోసం చేసిందని ఆయన దుయ్యబట్టారు. గజ్వేల్ మార్కెట్ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మర్కూక్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, అచ్చంగారి భాస్కర్, పాల రమేశ్ గౌడ్ పాల్గొన్నారు.

## 9న రైతు సమస్యలపై బీఆర్ఎస్ ధర్నా



కొల్చారంలో మాట్లాడున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం, నవంబర్ 6 : వానకాలం ధాన్యం సేకరణలో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ ఈనెల 9న కొల్చారంలో రైతులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్టు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రకటించారు. బుధవారం కొల్చారం బస్టాండ్ వద్ద మీడియాతో మాట్లాడారు. 9న గణపూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కార్యక్రమం ఉంటుందని, కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. అనంతరం కొల్చారం తహసీల్ కార్యాలయ ఎదుట ధర్నా ఉంటుందని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా, యూత్ అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు, నాయకులు నరేందర్ రెడ్డి, ముత్యంగారి సంతోష్ కుమార్, గౌరీశంకర్, కాశీనాథ్, చిట్యాల యాదయ్య, రవితేజ రెడ్డి, పాండ్ర వెంకటేశం, సొసైటీ చైర్మన్ మనోహర్ పాల్గొన్నారు.



సంగారెడ్డిలో అంజయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ తదితరులు

# పక్కాగా కులగణన పూర్తి చేయాలి

**మంత్రులు దామోదర రాజనర్సింహ, సురేఖ**

సంగారెడ్డి, నవంబరు 6: బీసీ కుల గణన సర్వేను నిష్పక్షపాతంగా చేపట్టాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని విద్యానగర్ కాలనీలో బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి ఎన్యూమరేటర్లు చేస్తున్న ఇంటింటి సర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కుల గణనతో ప్రభుత్వానికి పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. తద్వారా పథకాలు, కార్యక్రమాల అమలుకు ప్రభుత్వానికి ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా దీనిని చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని 26 మండలాల్లో 4లక్షలకు పైగా కుటుంబాలు ఉన్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో 2.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 1.65లక్షల కుటుంబాలను సర్వే చేస్తామన్నారు.150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌తో సర్వే చేయిస్తున్నట్లు తెలిపారు. నెలాఖరులోగా సర్వేను పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభిస్తున్న మంత్రులు



అందోల్: జోగిపేటలో సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కర్‌ను అతికిస్తున్న మంత్రి

### సర్వే పకడ్బందీగా చేపట్టాలి

అందోల్, నవబంర్ 6: ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోద రాజనర్సింహ అన్నారు. అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని 17, 18, 19 వార్డుల్లో పలువురి ఇండ్లకు వెళ్లి సమగ్ర కుటుంబ కులగణన సర్వేను ప్రారంభించి స్వయంగా డోర్లకు స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కులగణన సర్వేకు ప్రజలందరూ సహకరించి పూర్తి వివరాలు అందజేయాలని కోరారు. అంతకుముందు అందోల్ శివారులో నర్సింగ్ కళాశాల ఏర్పాటు కోసం జరుగుతున్న పనులను మంత్రి పరిశీలించి సూచనలు చేశారు. మంత్రి వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, డీటీ మధుకర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ ర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, నాగరాజు, దుర్గేశ్, సురేశ్, శంకర్, చెందర్‌నాయక్, మర్వెల్లి సంగమేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, శరత్‌బాబు, శివ, సందీప్‌గౌడ్, అనిల్‌రాజ్, లక్ష్మణ్, శేఖర్ ఉన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

**వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

సంగారెడ్డి, నవంబర్ 6: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు అని, విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే జ్ఞానం పెరిగి భవిష్యత్ బంగారుమయం అవుతుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డిలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రాయికోడ్ మాజీ జడ్పీటీసీ గొల్ల అంజయ్య పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు దామోదర రాజనర్సింహ, కొం ఎడా సురేఖ, రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ రియాజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ..నేటితరం సెల్‌ఫోన్లకే పరిమితం కాకుండా మంచి పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలతోపాటు ఇతర పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కొత్త చైర్మన్ సారథ్యంలో జిల్లాలో గ్రంథాలయాలు మరింత అభివృద్ధి చెంది పాఠకుల ఆదరణ పొందాలని మంత్రి ఆకాక్షించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజి అనంత కిషన్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుంధర, నాయకులు పాల్గొన్నారు.

## నేరాలను నియంత్రించాలి: సీపీ అనురాధ



హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట అధికారులు, సిబ్బందితో సీపీ అనురాధ

హుస్నాబాద్,నవంబర్ 6: అసాంఘిక కార్యకలాపాలు, మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టిసారించి ఉక్కుపాదం మోపాలని పోలీసులకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. బుధవారం హుస్నాబాద్, అక్కన్నపేట పోలీస్‌స్టేషన్లను ఆమె తనిఖీ చేశారు. ఆయా స్టేషన్ల ఆవరణలో మొక్కలు నాటి, పరిసరాలు, కార్యాలయాల నిర్వహణను, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..బెల్టుషాపులు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి అక్రమ మద్యం విక్రయాలను నివారించాలన్నారు. స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యను వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. 100 కాల్స్‌కు స్పందించాలన్నారు. వీపీవో వ్యవస్థను పటిష్టం చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కేసునూ పారదర్శకంగా పరిశోధన చేయాలన్నారు. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సీపీ పిలుపునిచ్చారు. ఏసీపీ సతీశ్ వాసాల, సీఐ శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్‌గౌడ్, రామకృష్ణ, కమలాకర్, ఎస్సైలు మహేశ్, విజయభాస్కర్, అభిలాష్, సీసీ నితిన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## బీసీ గణన చారిత్రక నిర్ణయం

**దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



సంగారెడ్డి జిల్లా చిట్కుల్‌లో బీసీ గణన ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ, నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు, నవంబర్ 6: బీసీ గణన చారిత్రాత్మక నిర్ణయం అని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో బుధవారం సమగ్ర ఇంటింటి సర్వేను ఆమె ప్రారంభించారు. గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఇంటింటికీ తిరిగి గుర్తింపు స్టిక్కర్ అంటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే- బీసీ కులగణన దేశానికే ఆదర్శం అన్నారు. ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నట్లు తెలిపారు. సమగ్ర ఇంటింటి సర్వేతో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు మైనార్టీలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యత లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ కులగణనతో బీసీలకు రాజకీయాల్లో అవకాశాలు పెరుగుతాయన్నారు. విద్య, ఉపాధి, ఇతర రంగాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. బ్రిటిష్ కాలంలో 1931లో జరిగిన కులగణన తరువాత దేశంలో మళ్లీ కాంగ్రెస్ హయాంలోనే ఇంటింటి సమగ్ర సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధుముదిరాజ్ మాట్లాడుతూ.. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తన సొంత గ్రామం చిట్కుల్ నుంచి ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు. బీసీ గణనతో బీసీల లెక్క తేలుతుందన్నారు. మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. కాగా, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఈ కార్యక్రమానికి గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ మరో నాయకుడు కాట శ్రీనివాస్‌గౌడ్ సైతం ఈ సమావేశానికి రాలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు నుంచి గూడెం మహిపాల్‌రెడ్డి, నీలం మధుముదిరాజ్, కాట శ్రీనివాస్‌గౌడ్ పోటీచేశారు. ఇప్పుడు ముగ్గురు ఒకే పార్టీలో ఉన్నా వారి మధ్య దూరం తగ్గడం లేదు. ముగ్గురు నాయకులను ఒకే వేదికపై చూసే భాగ్యం కాంగ్రెస్ శ్రేణులకు ఉంటుందా.? అనేది ప్రశ్నార్థకంగా ఉంది. గైర్హాజరు కావడం గ్రూప్ రాజకీయాలు మొదలయ్యాయా.? అనే ప్రశ్నను లేవనెత్తింది.



చిన్నకోడూరులో రైస్‌మిల్లును ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

## చిన్నకోడూరులో పర్యటించిన హరీశ్‌రావు

చిన్నకోడూరు, నవంబర్ 6: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పర్యటించారు. చిన్నకోడూరులో శ్రీనివాస రైస్‌మిల్లును ఆయన ప్రారంభించారు. ఇటీవల మృతి చెందిన కిష్టాపూర్ మాజీ సర్పంచ్ నారెడ్డి కమలాప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. హరీశ్‌రావు వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, సీనియర్ నాయకుడు ముక్కిస సత్యనారాయణ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, ఉమేశ్‌చంద్ర, ఇట్టబోయిన శ్రీనివాస్, గుండెల్లి వేణు, జంగిటి శ్రీనివాస్, కొండం రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## సర్వేకు ప్రజలందరూ సహకరించాలి

**సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి**



రాఘవాపూర్‌లో సర్వే వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, నవంబర్ 6: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి కోరారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవపూర్‌లో బుధవారం సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేకు క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటి యజమానులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. 6 నుంచి 8వరకు హౌస్ సర్వే నిర్వహించి యజమానుల పేర్లను నమోదు చేసి ఇంటింటికీ స్టిక్కర్ అతికిస్తామని తెలిపారు. 9 నుంచి ఇంటిలోని ప్రతిఒక్కరి వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. సర్వేను మండలస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీలు, నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారులు, డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, జిల్లా ఓవరాల్‌గా జిల్లా అదనపు కలెక్టర్, లోకల్ బాడీస్ నోడల్ అధికారిగా పర్యవేక్షిస్తారని తెలిపారు. కలెక్టర్ వెంట సిద్దిపేట రూరల్ తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, సర్వే సూపర్‌వైజర్, ఎన్యూమరేటర్లు ఉన్నారు.

## సామాజిక విప్లవకారుడు ప్రొఫెసర్ సాయిబాబా

**సంస్మరణ సభలో పలువురు ప్రముఖులు**




హుస్నాబాద్‌లో సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, నవంబర్ 6: అంగవైకల్యం ఉండి కూడా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి, ప్రజా సంఘాలను ఏర్పాటు చేసి పాలకులపై ఒత్తిడి పెంచిన ప్రొఫెసర్ సాయిబాబా నిజమైన సామాజిక విప్లవకారుడని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం హుస్నాబాద్‌లోని రాజరాజేశ్వర ఫంక్షన్‌హాల్‌లో జేఏసీ ఆధ్వర్యంలో సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, వీక్షణం సంపాదకులు వేణుగోపాల్, పలువురు హాజరై మాట్లాడారు. 40కి పైగా ఐక్యవేదికలు ఏర్పాటు చేసి ఆదివాసీల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం చేసిన ఘనత సాయిబాబాదేనన్నారు. ప్రజాసంఘాలను ఐక్యం చేసి పోరాట బాట పట్టించిన సాయిబాబా ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కుల కోసం ఉద్యమిస్తున్న వారిని, ప్రజా సమస్యలపై నిలదీసే వారిపై కక్షగట్టి నిర్బంధాలు చేస్తున్నదని, కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కవ్వలక్ష్మారెడ్డి, కోకన్వీనర్లు మేకల వీరన్నయాదవ్, డ్యాగల సారయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, రవిచందర్, లింగారెడ్డి, కుమారస్వామి, రాజయ్య, నాంపల్లి సమ్మయ్య పాల్గొన్నారు.

## కులవృత్తులకు పెద్దపీట

- మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ
- గీత కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ



సంగారెడ్డిలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 6: కాటమయ్య రక్షణ కిట్లతో గీత కార్మికులకు భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గీత కార్మికులకు కాటమయ్య సేఫ్టీ కిట్లను మంత్రులు పంపిణీ చేశారు. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 60 మంది గీత కార్మికులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గీత కార్మికులకు శిక్షణతో పాటు ఉచితంగా కాటమయ్య రక్షణ కిట్లను అందజేస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులకు పెద్దపీట వేస్తున్నట్టు వెల్లడించారు. సంప్రదాయ గీత కార్మికులు ప్రమాదాల బారినపడి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. పదేండ్లలో 750 మంది గీత కార్మికులు ప్రమాదాల కారణంగా మరణించారని తెలిపారు. జిల్లాలో 3500 గీత కార్మిక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వారికి శిక్షణ అందించడంతో పాటు ఉచితంగా కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. బీసీలు రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. బీసీల రాజకీయ ఎదుగుదల కోసమే సమగ్ర సర్వేను ప్రభుత్వం చేపడుతున్నదని మంత్రులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్, జిల్లా కల్లు గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు ఆశన్న గౌడ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు ఆదరణ

**ఉన్నత విద్యాశాఖ జేడీ యాదగిరి**

పటాన్‌చెరు, నవంబర్ 6: రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు ఆదరణ పెరుగుతున్నదని ఉన్నత విద్యాశాఖ జేడీ యాదగిరి అన్నారు. '21వ శతాబ్దపు నైపుణ్యాలపై ఎన్ఐఐటీ సహకారంతో బుధవారం పటాన్‌చెరులోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల శిక్షణ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రంలోని 150 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 1.47 లక్షల మంది విద్యార్థులు ప్రవేశం పొందారని తెలిపారు. అన్ని కేటగిరీల వారీగా 1076 డిగ్రీ కళాశాలలు ఉండగా, అందులో 6.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రభుత్వ కళాశాలల్లోనే సింహభాగం విద్యార్థులు ప్రవేశం పొందారని గుర్తుచేశారు. పదేండ్లలో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు రెట్టింపు అయ్యాయని, దోస్త్ వచ్చిన తర్వాత విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సీఎస్ఆర్ ద్వారా అభివృద్ధి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా అనాలిసిస్ అనే అంశాలపై అధ్యాపకులకు రెండు రోజుల శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ రత్నప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, ఎన్ఐఐటీ మేనేజర్ భగవాన్ మురళీ, శిక్షకులు జోసెఫ్, రమేశ్ జాదవ్, రాష్ట్రంలోని వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

**మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్**



ఎల్లుపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

టేక్మాల్, నవంబర్ 6: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొలుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట, టేక్మాల్, కోరంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం డీఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలన్నారు. ఇందులో ఏమాత్రం జాప్యం జరిగినా సదరు అధికారులే బాధ్యత వహించాలన్నారు. నిర్దేశిత గడువులోగా వడ్ల సేకరణ పూర్తిచేయాలని, ఈ విషయంలో అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా, నష్టపోకుండా అధికారులు వ్యవహరించాలన్నారు. ధాన్యం కొన్న 15రోజుల్లో రైతు ఖాతాలో నగదు జమ చేస్తామని తెలిపారు. అనంతరం టేక్మాల్ పశు వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సేవలపై ఆరాతీసి రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ తులసీరామ్, అధికారులు ఉన్నారు.

**చిరు ధాన్యాల సాగుకు**

## ముందుకు రావాలి

జహీరాబాద్, నవంబర్ 6: చిరుధాన్యాల సాగుకు రైతులు ముందుకు రావాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ రిటైర్డ్ డీన్ డాక్టర్ విజయ ఖాదర్ పిలుపునిచ్చారు. జహీరాబాద్ పట్టణ సమీపంలోని దిడ్గి గ్రామ శివారులోని డీడీఎస్-కేవీకే విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన 4వ అఖిల భారతీయ చిరుధాన్యాల సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా విజయ ఖాదర్ మాట్లాడుతూ.. చిరుధాన్యాలైన తైదలు, కొర్రలు, సామలు, సజ్జలు, జొన్న, పెసర, మినుము తదితర వాటిలో అనేక పోషకాలు ఉం టాయని, ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయని తెలిపారు. ప్రస్తుతం ఎక్కువ చిరుధాన్యాలను ధనవంతులు వాడుతున్నారని, వీటిని పేదలకు అందించాలని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం మహిళా రైతులను సత్కరించారు. కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు, చిరుధాన్యాల చెల్లండ్ల సమైక్య ప్రతినిధులు, మహిళా రైతులు పాల్గొన్నారు.



విజయ ఖాదర్‌ను సన్మానిస్తున్న డీడీఎస్ ప్రతినిధులు, మహిళా రైతులు

## బైక్ కాలువలో పడి ఇద్దరు మృతి



రాములు, నర్సింహులు (ఫైల్)

నర్సాపూర్, నవంబర్ 6: మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని రాయారావు చెరువు కాలువలో బైక్ అదుపుతప్పి మంగళవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం వివరాల ప్రకారం..మండలంలోని కాగజ్‌మద్దూర్‌కు చెందిన రాములు(40), నర్సింహులు(35) వ్యవసాయం చేస్తుంటారు. మంగళవారం నర్సాపూర్‌లో పని ముగించుకొని రాత్రి సమయంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. నర్సాపూర్ దాటిన తర్వాత రాయారావు చెరువు కాలువ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి అందులో పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయం స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడు రాములుకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. నర్సింహులుకు భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మేళకువలు పాటిస్తే 'పట్టు' సులభమే

చిన్నకోడూరు, నవంబర్ 6: పట్టుపురుగుల పెంపకంలో రైతులు మెళకువలు పాటిస్తే అత్యధికంగా పట్టుగూళ్ల దిగుబడి సాధించడం సులభమేనని పట్టు పరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో రైతులు పెద్దోళ్ల నర్సింహులు వ్యవసాయ క్షేత్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు మండలం జన్నారం మండలం నిర్మల్ ప్రాంతాల నుంచి వచ్చిన కొత్త రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ కుమార్‌యాదవ్, సీనియర్ శాస్త్రవేత్త, డాక్టర్ రాఘవేందర్, టెక్నికల్ అధికారి సెంట్రల్ సిల్క్ బోర్డు, సెరికల్చర్ ఆఫీసర్లు, పట్టు పరిశ్రమ శాఖ అధికారులతో కలిసి ఆయన మాట్లాడుతూ..ఇతర పంటలతో పోల్చుకుంటే పట్టుసాగు ఎంతో లాభదాయకం అన్నారు. పోషక విలువలు ఉన్న భూమిలో పంట సాగుచేస్తే నెలకు రూ. 70 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చు అన్నారు. భార్యాభర్తలు పట్టు సాగు చేసుకోవడం సులభతరం అని, దీంతో పాటు పాడి పశువులు, మేకలు, నాటు కోళ్లు పెంచుకుంటే అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ వినోద్‌కుమార్ యాదవ్, సెంట్రల్ సిల్క్ బోర్డ్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ రాఘవేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా పట్టు రైతుల సంఘం అధ్యక్షుడు పెద్దోళ్ల ఐలయ్య, గౌరవ అధ్యక్షుడు పి.నర్సింహులు, జన్నారం డీసీసీబీ చైర్మన్ అల్లం రవి, రైతులు పాల్గొన్నారు.